

## శిథిలావస్థలో జిపిఎస్ పాఠశాల

**ప్రజాశక్తి- డుంబ్రిగుడ:** మండలంలోని అరకు నేరేడు వలసలో గతంలో నిర్మించిన పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం గోడలు, రేకులు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ సమయంలో కూలిపోతాయోనని భయాందోళన చెందుతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో నిర్మించిన పాఠశాల పూర్తిగా శిథిలవస్థలో ఉండటంతో వేరే పాఠశాల భవనం నిర్మించారు. ఆ పాఠశాల భవనం ఉన్నప్పటికీ గతంలో నిర్మించిన పాఠశాలలో తరగతి గదులలో విద్యార్థులకు ఒకే చోట విద్యా బోధన చేయడంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారనీ, పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆ గ్రామస్తులు తెలిపారు.



శిథిలావస్థలో ఉన్న పాఠశాల

# ఆదివాసీలంటేనే సహజ నైపుణ్యం, సామర్థ్యం

## ▸▸అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారు ▸▸ఆదివాసీ దినోత్సవంలో సిఎం చంద్రబాబు

**ప్రజాశక్తి పాడేరు:** సహజ నైపుణ్యం, సామర్థ్యం ఆదివాసీల సహజ గుణాలని గిరి పుత్రుల్లో మరింత చైతన్యం తీసుకురాగలిగితే అభివృద్ధికి ఢోకా ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అల్లూరి జిల్లా పాడేరు మండలం వంజంగిలో శనివారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. వంజంగిలో వనదేవత మోదకొండమ్మ ఆలయాన్ని ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. అనంతరం గ్రామ సమీపంలో కాఫీ తోటలను పరిశీలించి, గిరిజన సంప్రదాయ పండుగలను వేడుకలను తిలకించారు. ఆదివాసీ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. టూరిజం అభివద్ధిపై తీసుకుంటున్న చర్యలు, ప్రాజెక్టుల వివరాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే లక్ష్యంతో కష్టపడుతున్నాన్నారు. విత్తన పండుగలు, సంక్రాంతి వరకూ ఎంతో పవిత్రంగా జరుపుకుంటున్నారని సిఎం కితాబు ఇచ్చారు. గత పాలకులు ఈ ప్రాంతాన్ని పట్టించుకోకపోవడంతో అనేక ఇబ్బందులు వచ్చాయన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని, దాన్ని నేను కొనసాగిస్తున్నానన్నారు.

ఒకప్పుడు ఏజెన్సీ అంటే గంజాయి ప్రాంతమని చెడుగా భావించేవారని. గత ప్రభుత్వం స్వచ్ఛమైన ఏజెన్సీలను కలుషితం చేసిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఎక్కడా గంజాయి మాట వినపడటంలేదు' అని సీఎం చంద్రబాబు తెలిపారు. ఆర్థిక సమస్యలు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు.

ఆగస్టు 15 నుంచి గిరిజన ఆడబిడ్డలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేయవచ్చు నన్నారు ఏజెన్సీలో 7 అన్న క్యాంటీన్ల ద్వారా భోజనం అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నెలాఖరున మెగా డీఎస్సీ ద్వారా టీచర్ల నియామకం చేస్తామని తెలిపారు. పాడేరు మోదకొండమ్మ ఆలయం అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నామనీ సీఎం చంద్రబాబు తెలిపారు..



కాఫీ తోటలో గిరిజనుడితో మాట్లాడుతున్న సిఎం



సింకు రాఖీ కడుతున్న గిరిజన మహిళ

### సిఎంకు ఘన స్వాగతం.. ఆత్మీయ వీడ్కోలు

**పాడేరు:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శనివారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లగిసిపల్లిలో హెలిపాడ్ వద్ద ఘన స్వాగతం తో పాటు మధ్యాహ్నం తిరుగు ప్రయాణమైన ఆయనకు ఆత్మీయ వీడ్కోలు లభించింది. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల నేపథ్యంలో వివిధ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, పలు ఒప్పందాలపై సంతకాలు ముగించుకొని బహిరంగ సభలో పాల్గొన్నారు. అనంతరం శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు సీఎం హెలీప్యాడ్ కు చేరుకొని అక్కడ నుంచి విజయవాడకు తిరుగు పయనమయ్యారు. వీడ్కోలు పలికిన వారిలో రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖా మాత్యులు, జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, నియోజక వర్గ ఇన్ చార్జ్ గిడ్డి ఈశ్వరి, అప్పల సరసయ్య, గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎం.ఎం. నాయక్, డైరెక్టర్ ఎస్.భార్గవి, జీసీసీ వైస్ చైర్మన్, ఎండీ కల్పనా కుమారి, జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ తదితరులు ఉన్నారు.



సిఎం చంద్రబాబుకు జిసిసి ఉత్పత్తులను చూపుతున్న ఎమ్‌డి కల్పనా కుమారి

### నిరుత్సాహ పరిచిన సిఎం పర్యటన

- నిర్దిష్టమైన హామీ ఇవ్వకుండా దాటవేత
- గిరిజన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం: సిపిఎం

**పాడేరు:** ప్రపంచ ఆదివాసి దినోత్సవ సందర్భంగా పాడేరు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర నిరాశ మిగిల్చిందని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసి సమాజం కొండంత ఆశతో ఎదురుచూస్తున్న 100శాతం ఉద్యోగ రిజర్వేషన్, టీచర్ పోస్టులపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఉత్తర్వులు ఇవ్వకుండా ప్రకటనలతో సరిపెట్టడంపై గిరిజన అభ్యర్థులకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. పాడేరు ఐటిడిఏ పరిధిలో సుమారు 20,000 మంది టీచర్ పోస్టులకు అర్హులు ఉన్నారని, మెగా డీఎస్సీలో టీచర్ పోస్టులు కోల్పోయే అవకాశాలు ఎక్కువ కనిపిస్తుందన్నారు.ఆదివాసి దినోత్సవం రోజు ఆదివాసులు కానుకగా న్యాయం చేస్తారని భావించామని, ఆదివాసుల ఆశలు నెరవేర్చకుండా నిరాశపరిచారని సీపిఎం జిల్లా కమిటీ అభిప్రాయం వ్యక్తం చేస్తోందన్నారు.

### నూరు శాతం రిజర్వేషన్ కల్పించాలి

**-సిఎంకు ఆదివాసీ గిరిజన సంఘం, స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ నేతల వినతి**

**పాడేరు:** మెగా డీఎస్సీలో ఏజెన్సీ గిరిజనులకు నూరు శాతం రిజర్వేషన్ కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఆదివాసి గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, ఆదివాసీ స్పెషల్ డీఎస్సి సాధన కమిటీ జిల్లా చైర్మన్ కుడుముల కాంతారావు, జిల్లా కన్వీనర్ సాగిన ధర్మన్నపడాల్, ఆదివాసి నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్.సత్యనారాయణతో కూడిన ప్రతినిధి బృందం లగసపల్లిలో హెలిఫేడ్ వద్ద శనివారం వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ జీవో 3 స్థానంలో, మరో ప్రత్యామ్నాయ ఉత్వర్వులు ఇస్తామని, సుప్రీంకోర్టు తీర్పునీ దృష్టిలో పెట్టుకొని నిపుణులతో కమిటీ వేశామని, చర్చిస్తున్నామని, అతి త్వరలో 100శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పి.అప్పలనర్స విలేకరులతో మాట్లాడుతూ, ప్రకటనల పేరుతో కాలయాపన చేయడంతో ఏజెన్సీ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని, ఇప్పటికి పాడేరు ఏజెన్సీలో సుమారు 20వేల మంది టీచర్స్ పోస్టులకు అర్హతలు సాధించారాని, కానీ రిజర్వేషన్ కల్పించక పోవడం దారుణమన్నారు. ప్రభుత్వం 100శాతం రిజర్వేషన్ కల్పించే ఉత్తర్వులు జారీ చేసే వరకు కూడా ఉద్యమం సాగిస్తామన్నారు.భవిష్యత్తు కార్యాచరణ పై రాష్ట్ర జిల్లా కార్యవర్గం సమావేశం ఏర్పాటు చేసి ప్రకటిస్తామన్నారు. వీటితోపాటు రాష్ట్ర ముఖ్యమంత్రికి సమర్పించిన వివిధ సమస్యలపై వినతి పత్రం గూర్చి వివరించారు. వాటి వివరాలు... ఏజెన్సీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ రద్దు చేయాలని, ఆదివాసీ మాతృభాషా విద్యా వాలంటరీలకు ఉద్యోగ భద్రత, గురుకులం సెక్యూరిటీ గార్డ్స్, గెస్ట్ ఫ్యాకల్టీ, సిఆర్టిల సమస్యలపై వినతిపత్రం సమర్పించారమన్నారు.ఈ సమస్యలపై ముఖ్యమంత్రి పరిశీలిస్తామని, సమస్య పరిష్కరిస్తానన్నారు.





ఉచిత ఆటో సర్వీస్‌ను ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

## రోగులకు ఉచిత ఆటో సర్వీసు ప్రారంభం

**ప్రజాశక్తి-రంపచోడవరం :** లోతట్టు గిరిజన గ్రామాల నుండి గిరిజనులు, గిరిజనేతరులు రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్, గుంటూరులో హాస్పిటల్స్‌కు వెళ్ళి చనిపోతే ఆ చనిపోయినటువంటి వ్యక్తి స్వగ్రామానికి తీసుకు రావడానికి కాకినాడ నుండి వి.ఆర్.పురం, ఎటపాక, వై.రామవరం, గుర్తేడు వెళ్ళాలంటే సుమారు 25వేలు ఖర్చవుతోంది. నిరుపేదలైన గిరిజనులు, గిరిజనేతరుల వద్ద అంత డబ్బు ఉండదనే ఉద్దేశ్యంతో దూరప్రాంతాలకు వెళ్ళేందుకు అలాగే రాజమండ్రి, కాకినాడ, విజయవాడ, హైదరాబాద్ ఎక్కడ ఏజెన్సీ వాసులు చనిపోయినా సరే మృతదేహాన్ని వారి ఇంటికి తరలించడానికి ఎమ్మెల్యే తన సొంత వాహనాన్ని అందించారు. గత సంవత్సరం ఆదివాసీ దినోత్సవం రోజున సొంత వాహనాన్ని అంబులెన్సుగా మార్చి ఉచితంగా సేవలందించడం ప్రారంభించారు. రంపచోడవరంలో రోడ్డుప్రక్కన ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటుండగా హాస్పిటల్ వద్దకు వెళ్ళే రోగులు నడిచి వెళ్తున్నారని గమనించి తన సొంత ఖర్చులతో ఉచితంగా ఆటోను ఏర్పాటు చేశారు. ఆటో రంపచోడవరం అంబేడ్కర్ సెంటర్ మరియు ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి హాస్పిటల్ వరకు తిరిగి హాస్పిటల్ నుండి అంబేడ్కర్ సెంటర్ వరకు 2 కిలోమీటర్లు ఉచితంగా ఎవరిదగ్గర ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా తరలిస్తున్నారు.'ఉచిత ఆటోసేవ'ను ఎమ్మెల్యే శిరీష ఆర్థిక సహాయంతో అందించారు. ఎస్టి కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జిరెడ్డి, గిరిజన తెగలకు చెందిన కులపెద్దలతో కలసి సబ్ కలెక్టర్ కల్పశ్రీ శనివారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



సబ్‌కలెక్టర్ కల్పశ్రీని సన్మానిస్తున్న సర్పంచ్ దుశంతుడు తదితరులు

## సబ్‌కలెక్టర్‌కు సన్మానం

**ప్రజాశక్తి - వై.రామవరం:** రంపచోడవరం నియోజకవర్గంలో, సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించి, బదిలీపై వెళ్తున్న, సబ్ కలెక్టర్ కల్పశ్రీని గుర్తేడు ప్రజలు, సర్పంచ్ దుశంతుడు మర్యాదపూర్వకంగా కలిశారు. గుర్తేడును మండల కేంద్రంగా ప్రకటించడంలో ఆమె ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఘనంగా సన్మానించారు.



అరకులోయలో కురుస్తున్న వర్షం

## మన్యంలో భారీ వర్షం

**ప్రజాశక్తి-అరకులోయ:** పర్యాటక కేంద్రమైన అరకులోయలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ కాయడంతో స్థానికులు, పర్యాటకులు ఎండ వేడిమి తట్టుకోలేక ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఇంతలోనే భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో వాహన చోదకులు స్థానికులు సేద తీరారు. అరకులోయ, అనంతగిరి, విశాఖ ప్రధాన రహదారి ఘాట్ రోడ్లులో కుండ పోత వర్షం కురవడంతో వాహన చోదకులు అసౌకర్యానికి గురయ్యారు.

**చింతూరు:** మండలంలో శనివారం పెద్ద ఉరుములు మెరుపులతో కూడిన గాలివాన కురిసింది. ఏకధాటిగా సుమారు రెండున్నర గంటల సేపు కుంభవృష్టి కురిసింది. డ్రైనేజీలు నిండిపోయి రోడ్డుపై నీరు నిలిచిపోయింది. సాయిబాబా గుడి నుంచి సినిమాహాలు మీదుగా వాడబజారు ఎస్టీ కాలనీ మెడికల్‌కాలనీ రోడ్లు జలమయమయ్యాయి. నడిచేందుకు కూడా వీలు లేకుండా నీరు నిలిచిపోయింది. రోడ్లపై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయినాయి.



## ఘనంగా రాఖీ పండగ

**ప్రజాశక్తి-అరకులోయ:** పర్యాటక కేంద్రమైన అరకు లోయలో రాఖీ పండుగ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండగను పురస్కరించుకొని అన్నా తమ్ముళ్లకు అక్క చెల్లెలు రాఖీలు పడుతుండడం సందడిగా మారింది. ఒకరినొకరు స్వీట్లు తినిపించుకుంటూ ఆనందంగా గడిపారు. దీంతో అరకులోయ టౌన్షిప్ కళకళలాడింది. దుకాణాలన్నీ రాఖీ కొనుగోలుతో సందడిగా మారింది.



అరకులోయలో రాఖీ కడుతున్న చెల్లెమ్మ

**డంబ్రిగుడ:** మండల కేంద్రంలో రాఖీ పండగను ఘనంగా నిర్వహించారు. అన్నదమ్ములకు అక్క,చెల్లెల్లు రాఖీ కట్టి స్వీట్లు తినిపించి ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంట్లో అన్నదమ్ములకు అక్క, చెల్లెళ్లు రాఖీ కట్టి పండగ జరుపుకోవడంతో మండలంలోని ఊరంతా సందడి నెలకొంది. మండల కేంద్రంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో పర్యాటకులు అన్నదమ్ములకు రాఖీలు కట్టి సందడి చేశారు.

# భవిష్యత్తు పోరాటాలకు గిరిజనులు సిద్ధం కావాలి

- పలు చోట్ల ఘనంగా ఆదివాసీ దినోత్సవం
- హక్కుల కోసం పోరాడాలని పలువురు నాయకుల పిలుపు
- ఆకట్టుకున్న గిరిజనుల నృత్యాలు, వేషధారణలు



రాజవొమ్మంగి: ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

**ప్రజాశక్తి - రాజవొమ్మంగి:** భవిష్యత్తులో జరిగే పోరాటాలకు ఆదివాసీలు సిద్ధం కావాలని ఆదివాసీ జెఎసి నాయకులు వంతు బాలకృష్ణ, కొండ్ల సూరిబాబు, వజ్రపు అప్పారావు, గంపా నాగరాజు తదితరులు పిలుపునిచ్చారు. జెఎసి ఆధ్వర్యంలో రాజవొమ్మంగిలో ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆదివాసీ జెండాను జెఎసి నేత బాలకృష్ణ ఆవిష్కరించారు. అంతకుముందు రాజవొమ్మంగిలో భారీ ర్యాలీ మానవహారం నిర్వహించారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథిగహం వద్ద జెఎసి నాయకులు పెద్దిరాజు అధ్యక్షతన బహిరంగ సభలో పలువురు నాయకులు ఆదివాసీల హక్కుల గురించి ఉపన్యసించారు. కార్యక్రమంలో జెఎసి, ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రజాసంఘాల నేతలు, గిరిజన ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**రంపచోడవరంను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలి: ఎంపిపి వెంకటలక్ష్మి**

రంపచోడవరంను గిరిజన జిల్లా గా ప్రకటించాలని ఎంపిపి గోము వెంకటలక్ష్మి శనివారం డిమాండ్ చేశారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం జిల్లాలో కలపడం వలన అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని ప్రభుత్వం ఇటువంటి ప్రతిపాదన మాని గిరిజనుల ప్రయోజనాల కోసం ఆలోచించాలన్నారు.

**రంపచోడవరం:** గిరిజన సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివాసీ దినోత్సవం సంఘం జిల్లా అధ్యక్షులు ఇ.సిరిమల్లిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసులు మనుగడ కోసం పోరాడాల్సిన అవసరం ఉందని, శతశాతం రిజర్వేషన్ ఏజెన్సీ ప్రాంతంలో ప్రకటించాలని, 1/70 చట్టం పీసా చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తీగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**అధికారులు, ప్రజాప్రతినిధులు లేరు..**

వైటిసిలో ఆదివాసి దినోత్సవాల్లో ఆదివాసీ జాతికి ఘోరమైన అవమానం జరిగిందని 'ఆదివాసీ సంక్షేమ పరిషత్' (274/16) జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు అన్నారు. పది సంవత్సరాలుగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాల్లో పాల్గొన్నానని ఎప్పుడూ ఇంత ఘోరమైన రీతిగా కార్యక్రమం జరగలేదఅన్నారు. వేడుకల్లో కులసంఘాల నాయకులు ప్రజాసంఘాల నాయకులు తెలిపే సమస్యలను నోట్ చేసుకుని వాటిని ప్రజా ప్రతినిధులు అధికారులు పరిష్కరించాలని వారు అడిగే ప్రశ్నలకు జవాబుదారీగా ఉండాలని అయితే అధికారులు ఎవరరూ లేకుండా ఈ కార్యక్రమం జరిపించారని ప్రజాసంఘాల నాయకులు సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక విస్తుబోయారు. ప్రజాప్రతినిధులు అధికారులు ఇక్కడ జరిగే కార్యక్రమంలో హాజరుకాకుండా పాడేరులో జరిగేటువంటి కార్యక్రమంలో హాజరవ్వడం వెనక అర్థమేంటో తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. గత ఏడాది కూడా పాడేరులో కార్యక్రమం జరిగిందని అప్పుడు వెళ్లని అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ ఏడాది మాత్రమే ఎందుకువెళ్లారో తెలపాలన్నారు.



రంపచోడవరం : జెండా ఆవిష్కరించిన సిపిఎం నాయకులు సిరిమల్లిరెడ్డి

**మారేడుమిల్లి:** ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆదివాసీ హక్కుల కోసం ఐక్యపోరాటాలు చేయాలని నాయకుల పిలుపు నిచ్చారు. ఆదివాసీ పోరాట నాయకులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి, జెడ్‌పిటిసి, వైస్ ఎంపిపి తదితరులు పాల్గొన్నారు.

**సీలేరు:** జికెవీధి మండలం సీలేరు దుప్పిలివాడ దారకొండ గుమ్మిరేవుల పంచాయతీల్లో శనివారం ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక మెయిన్‌రోడ్‌లో మానవహారం నిర్వహించి దింసా నృత్యాలు చేశారు. కార్యక్రమంలో దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మార్క్య రాజు, జిల్లా అధ్యక్షుడు మనోజ్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు జె.ప్రసాద్ బాబాజీ తదితరులు పాల్గొన్నారు. దారకొండలో ఆదివాసీ జెఎసి నాయకులు విన్నూత వేషధారణలో ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్నారు. జేఏసీ నాయకులు విష్ణుమూర్తి శోభ, గొర్లగణేశ్వరరావు మాజీ ఎంపిటిసి పోతురాజు గోవిందు పాల్గొన్నారు. చప్పర్ల సంతలో సిపిఎం నాయకులు అపరంగి బుజ్జిబాబు గాలికొండ సర్పంచ్ బుజ్జిబాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దారకొండ పంచాయతీ గంగవరంలో ఆదివాసీలు ర్యాలీ నిర్వహించి ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.

**గంగవరం:** ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఆదివాసీ నాయకులు మాజీ సర్పంచ్ కుంజం వెంకటేశ్వర్లు దొర అధ్యక్షత వహించారు. ఎంపిపి పల్లాల కృష్ణారెడ్డి, జడ్పిటిసి బేబీ రత్నం వైస్ ఎంపిపి గంగాదేవి, సర్పంచ్ కలుముల అక్కమ్మ, మాజీ ఎంపిపి డాక్టర్ తీగల ప్రభ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఆదివాసి నాయకులు కె.రాంబాబు, ఎ.రాంబాబు నాయకత్వం వహించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదివాసీ జెండాను సర్పంచ్ అక్కమ్మ ఆవిష్కరించారు. అల్లూరి విగ్రహానికి తాసిల్దార్ శ్రీనివాసరావు ఎంపీడీవో లక్ష్మణరావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

**జికె వీధి :** మండలంలోని జికె వీధి సప్పర్ల, రంపుల పలు గ్రామాల్లో ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించినట్టు గాలికొండ సర్పంచ్ కాకూరి బుజ్జిబాబు, ఎంపిటిసి అంపురంగి బుజ్జిబాబు తెలిపారు. కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



సీలేరు: థింసా నృత్యం చేస్తున్న ఆదివాసీ మహిళలు



జికె వీధి: ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ నాయకులు



గంగవరం : నినాదాలు చేస్తున్న ఆదివాసీ నాయకులు, ప్రజాప్రతినిధులు



మారేడుమిల్లి : ఆదివాసీ పెద్దలను సన్మానిస్తున్న ఎంపిడిఒ, ప్రజా ప్రతినిధులు


అనంతగిరి ఆదివాసీ సభలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు


ముంచంగిపుట్టులో జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

# ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి -యంత్రాంగం

**అనంతగిరి:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆ సంఘం నేత నాగులు అధ్యక్షతన సభను నిర్వహించారు. ముఖ్య అతిథి జడ్పీటీసీ గంగరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలు, హక్కులను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు అరకులో అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో 3 పునరుద్ధరణ చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు వంతల. భాస్కరరావు మాట్లాడుతూ, గిరిజన చట్టాలు హక్కులు పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిల్లో. మోస్యు, ప్రజా సంఘాల నాయకులు పాంగి రవీంద్ర, చంటి, భీమన్న, మురళి తదితరులు పాల్గొన్నారు.

**ముంచంగిపుట్టు:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను ఆధ్వర్యంలో ఆదివాసి గిరిజన సంఘం జెండాను సంఘం సీనియర్ నేత వి.త్రినాథ్ ఆవిష్కరించారు. సంఘం జిల్లా నాయకులు కొర్రా త్రినాథ్ మాట్లాడుతూ, ఆదివాసి గిరిజన ప్రాంతాల్లో వంద శాతం రిజర్వేషన్‌తో ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. హక్కులు, చట్టాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రక్షించాలని డిమాండ్ చేశారు. వైస్.ఎంపీపీ 1 పి.సత్యనారాయణ మాట్లాడుతూ, హక్కులు చట్టాల అమలుకై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు జి.నారాయణ, ఎస్.గాసిరామ్ దొర, పి.రామదాసు, జి.జినబందు , కె.డొంబు, ఎస్ఎఫ్ఐ నాయకులు భాస్కర్, అనిత, దివ్య, నందిని, మహాలక్ష్మి ప్రవీణ్ కుమార్, వరుణ్ పాల్గొన్నారు.

**అరకులోయ:** అరకులోయ మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అరకులోయ అంబేద్కర్ విగ్రహం ఆవరణలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు, ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు ఆదివాసి జెండాను ఎగురవేశారు. ఉద్యోగ సంఘం నాయకులు పాంగి.సందో, మండల జె.సింహాచలం, అంబేద్కర్ సంఘం నాయకులు డి.గోవర్ధన్ మాట్లాడుతూ, ఆదివాసి దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్య క్రమంలో జె.ఎ.సి నాయకులు గోపాల్, కామేష్, ఆనంద్, రాజ్‌కుమార్, బుద్ధ, నారాయణ పాల్గొన్నారు.

**చింతపల్లి:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన సంఘం జెండాను వంతల రామారావు ఆధ్వర్యంలో ఏపి ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ జీవో నెంబర్ 3 స్థానంలో ఏజెన్సీలో 100శాతం ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ జీవోను తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు మజ్జి రాంబాబు, గ్రామ పెద్దలు వంతల రామారావు, దొంగముంటి సత్యనారాయణ, సాగిన సత్తిబాబు, సాగిన రాజేశ్వరి, దొంగబంటి మంగ, కొర్ర కన్నమ్మ, కొర్ర ముత్యాలమ్మ, కొర్ర శాంతి తదితరులు పాల్గొన్నారు.


అరకులోయలో...


చింతపల్లిలో...

## విద్యార్థులకు దేశ భక్తి బృందగాన పోటీలు

**ప్రజాశక్తి - ఆరిలోవ** : ప్రజానాట్యమండలి ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యాన శ్రీ విజేత హైస్కూల్‌లో 'దేశభక్తిని చాటుదాం' బృందగాన పోటీలు శనివారం నిర్వహించారు. ఆరిలోవ ప్రాంతంలో ఉన్న భారతీ స్కూల్, బ్రిలియంట్ స్కూల్, తోటగరువు జడ్‌పిహెచ్ స్కూల్, శ్రీవిజేత స్కూల్, సెయింట్ ఆన్స్ స్కూల్, క్రిస్టియన్ స్కూల్, అంజన స్కూల్ తదితర 8 పాఠశాలల నుండి 120 మంది విద్యార్థులు పాల్గొని దేశభక్తిని ప్రబోధిస్తూ బృందగానాలు ఆలపించారు. ఈ బృందగాన పోటీలకు అన్నమయ్య కళాక్షేత్రం నిర్వాహకులు వై.అప్పారావు, భగవాన్‌దాస్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి మాట్లాడుతూ, 'దేశభక్తిని చాటుదాం' అంటూ బృందగాన పోటీలు నిర్వహించడం ద్వారా పిల్లల్లో ఐక్యత భావాన్ని పెంచడం, వారిలో ఉండే కళల్ని వెలికి తీయడం, నిజమైన దేశభక్తిని చాటడం, పాటల పట్ల పిల్లల్లో ఆసక్తిని పెంచడం ఈ కార్యక్రమం ఉద్దేశం అని పేర్కొన్నారు. శ్రీవిజేత స్కూల్ ప్రిన్సిపల్ రేఖ మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించి పిల్లల్ని ఎంతో ఉత్సాహ పరచడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీలను ఎం.ఉమామహేశ్వరరావు నడిపించారు.


దేశ భక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

## దళితులపై దాడులను అరికట్టాలి

**ప్రజాశక్తి-ఆనందపురం :** తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి స్వగ్రామంలో ఆయన అనుచరులు దళిత యువకుడిని నిర్బంధించి దాడి చేసిన ఘటనపై మాల మహానాడు నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు నిరసనగా ఆనందపురం మండలం లోడగలవానిపాలెం ఎస్‌సి కాలనీలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద మాల మహానాడు మండల అధ్యక్షుడు సియ్యాద్రి రాంబాబు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు బోని సన్యాసిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు కులాల మధ్య రాజకీయ అధికారం మారుతున్నా దళితుల పరిస్థితిలో మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు మాట్లాడుతూ, తిరుపతి ఘటన కరుణాకర్ రెడ్డి ప్రమేయంతో జరిగిందని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో కాకినాడ దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్య, డాక్టర్ సుధాకర్ మరణం, చీరాల కిరణ్ ఘటన, రాజానగరం ప్రసాద్ శిరోమండనం వంటి అనేక దాడులు జరిగినా న్యాయం జరగలేదని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా గుర్రంపాలెం బాలికపై సామూహిక అత్యాచారం, తిరుపతి జిల్లాలో బీటెక్ విద్యార్థి జేమ్స్‌పై దారుణ హింస, పిఠాపురం సామాజిక బహిష్కరణ వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. రాష్ట్రంలో దళిత హోంమంత్రి ఉన్నప్పటికీ పర్యవేక్షణ లోపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో లంక పైడిరాజు, రాచర్ల ముకుందరావు, యాగంటి రామారావు, ఎజ్జల దాసు, బోని ముత్యాలు, నిమ్మకాయల అప్పలరాజు, సియాద్రి వాసు, బొబ్బది రామారావు, పొట్నూరి చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సృజనాత్మకతను వెలికితీసేందుకు నాటక పోటీలు

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు నాటిక పోటీలు దోహదపడతాయని ఎంఇఒ- 1, 2 లు ఎం .శివరాణి, డి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కళాసాహితీ సంస్థ అధ్వర్యంలో స్థానిక ఎండిఒ కార్యాలయంలో రెండ్రోజుల పాటు జరుగనున్న నాటికి పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చదువుతో పాటు కళలు, సాహిత్యం, క్రీడల పట్ల విద్యార్థులు ఆశక్తి కనబరచాలని సూచించారు. స్థానిక సన్ స్కూల్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ తొలుత జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. సభకు అధ్యక్షత వహించిన కళాసాహితీ సంస్థ అధ్యక్షులు పి.రాజేంద్రప్రసాద్ వర్మ మాట్లాడుతూ, తమ సంస్థ ఆహ్వానం మేరకు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారంటే నాటికల పట్ల వారికున్న ఉత్సుకత ఇట్టే కనబడుతోందన్నారు. కళాసాహితీ సంస్థ గౌరవాధ్యక్షులు ఆర్.అప్పల నరసయ్య, సంస్థ సభ్యులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థినులు ప్రదర్శించిన 'ఫాదర్ ఆఫ్ లవ్' నాటిక ఎంతగానో ఆలోచింపజేసింది.

## పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

**ప్రజాశక్తి-ఆనందపురం :** ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నూతన భవన నిర్మాణ పురోగతిని పరిశీలించి, పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టిక, ఆన్‌లైన్ నివేదికలు, మందుల గది, లేబర్ రూమ్, ప్రయోగశాల, వార్డులను పరిశీలించారు. అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ప్రసవ గది, శస్త్రచికిత్స కోసం అవసరమైన ఆధునిక పరికరాలను సమకూర్చుతామని హామీ ఇచ్చారు. సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని, టీకాల కార్యక్రమం పద్ధతిగా నిర్వహించాలని, గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షబీనా భాను, జిల్లా ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మల్లకంభ పోటీలకు గుడిలోవ విద్యార్థి

**ప్రజాశక్తి - ఆనందపురం :** విద్యా భారతి ఆధ్వర్యంలో జరిగిన జోన్ స్థాయి క్రీడా పోటీలలో శ్రీ సరస్వతి విద్యా విహార్ గుడిలోవ విద్యార్థి ఆర్.చందు ప్రతిభ కనబరిచాడు. కర్ణాటక రాష్ట్రం బెలగావిలో జరిగిన మల్లకంభ పోటీలలో 14 సంవత్సరాల బాలుర విభాగంలో ద్వితీయ స్థానాన్ని సాధించి నవంబర్‌లో మధ్యప్రదేశ్‌లో జరగనున్న విద్యా భారతి అఖిల భారతీయ జాతీయ స్థాయి పోటీలకు చందు ఎంపికయ్యాడు. చందును పాఠశాల ప్రధానాచార్యులు దూసి రామకృష్ణ, అధ్యాపకులు అభినందిస్తూ జాతీయ స్థాయిలో కూడా విజయపథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



అవార్డు తీసుకుంటున్న బిఎస్‌రెడ్డి

## ఇంద్రజాలకుడు బిఎస్.రెడ్డికి అంతర్జాతీయ ఖ్యాతి

**ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ :** విశాఖ నగరానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలకుడు బి.ఎస్ రెడ్డి 'ఆస్కార్ ఆఫ్ మ్యాజిక్'లో చోటు సంపాదించి, అమెరికాలో 'మెర్లిన్ అవార్డు-2025'ను అందుకుని అత్యుత్తమ ఇంద్రజాలకునిగా గుర్తించి ప్రతిష్టాత్మకమైన 'మెర్లిన్ అవార్డు-2025'ను శుక్రవారం రాత్రి అమెరికాలోని లాస్‌వెగాస్‌లో ప్రదానం చేశారు. మ్యాజిక్ అకాడమీ అవార్డ్స్ నైట్-2025లో భాగంగా బిఎస్‌రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. ఇంటర్నేషనల్ మెజీషియన్స్ సొసైటీ నుంచి బెస్ట్ ఇల్యూషనిస్ట్ ఆఫ్ ఇండియాగా మెర్లిన్ అవార్డు-2025 అందుకోవడం గర్వంగా ఉందని బి.ఎస్ రెడ్డి మీడియాకు తెలిపారు.

## ఉచిత బస్సు ప్రయాణంపై సమీక్ష

**ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్:** ఎపిఎస్‌ఆర్టిసి రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు, ఈ నెల15వ తేదీ నుండి ప్రారంభించే స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణంపై విశాఖ జిల్లాలో బస్సులు, బస్‌స్టేషన్ మెయింటినెన్స్ మీద సమీక్ష నిర్వహించారు. విశాఖపట్నం జిల్లాలో ద్వారకా బస్‌స్టేషన్ లో కొత్తగా బెంచీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. బస్‌స్టేషన్ శుభ్రత మొదలగు అంశాలపై అధికారులు సూపర్‌వైజర్లకు 15న ముఖ్య అతిథులతో ప్రారంభించేందుకు డిపో మేనేజర్లు సిద్ధం కావాలని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సింహాచలం, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సెంట్రల్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం

**ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ:** సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ 144వ వ్యవస్థాపకుని దినోత్సవాన్ని ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నంలో శనివారం ఘనంగా నిర్వహించారు. దేశంలోని మొట్టమొదటి స్వదేశీ బ్యాంకును స్థాపించిన సర్ సోరాబ్జీ పోచ్‌ఖనావాలా జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ప్రాంతీయ అధికారి ఎ.వి.ఆర్.మూర్తి వ్యవస్థాపకుడి చిత్రపటానికి పూలమాల వేశారు. ఉద్యోగులు నిజాయితీగా ఉండాలని కోరారు. ప్రాంతీయ కార్యాలయం సమీప శాఖల సిబ్బంది పాల్గొని, వ్యవస్థాపకుని వారసత్వాన్ని కొనసాగించాలనే తమ ప్రతిజ్ఞను పునరుద్ఘాటించారు.


సమావేశంలో మాట్లాడుతున్న పద్మ, సత్యవతి

## 11న ఐద్వా విశాఖ జిల్లా మహాసభలు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) విశాఖ జిల్లా 17వ మహాసభలను ఈ నెల 11న మద్దిలపాలెం సవేరా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించాలని, శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగిన ఐద్వా విశాఖ జిల్లా కమిటి సమావేశంలో నిర్ణయించారు. ఈ విషయాన్ని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి మీడియాకు తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారంలో ముఖ్య భూమిక పోషిస్తున్న ఐద్వా 1936లో కృష్ణా జిల్లాలో ప్రారంభమైందన్నారు. దేశవ్యాప్త సంఘంగా 1981లో ఏర్పడిందన్నారు. మద్దిలపాలెం వేదికగా జిల్లా మహాసభలకు సిద్ధమవుతుం దన్నారు. ఈ మూడు సంవత్సరాల కాలంలో కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు.

# సందడిగా కోయ్‌త్తోర్ పండూం దక్కట్


సమావేశానికి హాజరైన గిరిజనులు


నృత్య ప్రదర్శన చేస్తున్న ఆదివాసీ మహిళలు

**ప్రజాశక్తి - కూనవరం**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అల్లూరి జిల్లా కూనవరం మండలం ఉదయ భాస్కర్ థియేటర్ వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన శనివారం తలపెట్టిన కోయ్‌త్తోర్ పండూం దక్కట్ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా, ఉత్తేజంగా సాగింది. ముందుగా స్థానిక ఉన్నత పాఠశాల ప్రాంగణం నుంచి 3500 మంది గిరిజన ప్రజలు భారీ ప్రదర్శన చేపట్టారు. వారంతా పోలవరం నిర్వాసిత మండలాలైన కూనవరం, విఆర్.పురం, ఎటపాక, చింతూరు ప్రాంతాల నుంచి తరలివచ్చారు. దారి పొడువునా కొమ్ము కోయ, ఆదివాసీ నృత్యాలతో అలరిస్తూ సభాస్థలికి చేరుకున్నారు. అక్కడ సిపిఎం మాజీ ఎంపీ, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ్ మంచ్ జాతీయ నాయకులు మిడియం బాబూరావు ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆదివాసీ అమరులు అల్లూరి సీతారామరాజు, బిర్సా ముండా, కొమరం భీమ్, కుంజా బొజ్జి, సున్నం రాజయ్యల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు.

అనంతరం సంప్రదాయ కొమ్ము కోయ, ఆదివాసీ పెళ్లి, థింసా, అందె నృత్యాలు, కళారూపాలతో సభా ప్రాంగణం హోరెత్తింది. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, సిపిఎం ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, స్థానిక జెడ్‌పిటిసి గుజ్జా విజయ, ఎంపిపి పాయం రంగమ్మ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, ఎంపిటిసిలు అమ్మాజీ, జయసుధ, పూనెం ప్రదీప్ కమార్, సర్పంచులు బొగ్గ వెంకమ్మ, శంకర్, బొగ్గా రామారావు, నాయకులు పాయం సీతారామయ్య, తెల్లం తమ్మయ్య, బాబు బొర్రయ్య, కారం సుందరయ్య, పల్లపు వెంకట్ పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు


డోలు వాయిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

## తడబడిన సింహాద్రి వైజాగ్ లయన్స్

### 7 వికెట్ల తేడాతో తుంగభద్ర వారియర్స్ ఘన విజయం

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :**

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్-4 లో భాగంగా శనివారం రెండో మ్యాచ్ తుంగభద్ర వారియర్స్ - సింహాద్రి వైజాగ్ లయన్స్ మధ్య జరిగింది. టాస్ ఓడిపోయి మొదట బ్యాటింగ్ చేసిన సింహాద్రి వైజాగ్ లయన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 109 పరుగులు సాధించి 110 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందు ఉంచింది.

ఆ లక్ష్యాన్ని తుంగభద్ర వారియర్స్ 12.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి114 పరుగులు సాధించి ఈ సీజన్లో తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్టు బ్యాటర్ అభిషేక్‌రెడ్డి 34 బంతుల్లో మూడు ఫోర్‌లతో 40 పరుగులు సాధించగా తుంగభద్ర వారియర్స్ బౌలర్లు తోషిత్ యాదవ్ 3, చీపురుపల్లి స్టీఫెన్ 2, సిహెచ్ సిద్ధార్థ 2, కెవి శశికాంత్, సౌరబ్ కుమార్, ఒక్కొక్క వికెట్ తీశారు. 110 పరుగులు విజయ లక్ష్యంతో బరిలో దిగిన తుంగభద్ర వారియర్ జట్టు కెప్టెన్ మహిప్ కుమార్ 37 బంతుల్లో 2 సిక్స్‌లు 8 ఫోర్ లతో 57 సాధించగా జి.జ్ఞానేశ్వర్ 34 బంతుల్లో 3 సిక్స్ లు, 3 ఫోర్‌లతో 40 పరుగులు చేసి జట్టు విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించారు. సింహాద్రి వైజాగ్ లయన్స్‌కు చెందిన బౌలర్లు టి.విజయ్ 2 వికెట్లు, రంజిత్ దర్జీ 1 వికెట్ తీసారు. మ్యాచ్‌లో అద్భుతంగా రాణించిన మహీప్ కుమార్ కి ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డ్, బెస్ట్ ఎకానమీ అవార్డ్ అందుకున్న సౌరవ్ కుమార్ కు క్యాచ్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్, ప్రశాంత్ కుమార్‌కు పవర్ ఫుల్ స్ట్రైకర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ సి.ఆర్ .జ్ఞానేశ్వర్‌కు అందించారు.

## రక్షాబంధన్ పవిత్ర పండగ

### - మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** వైసిపి దక్షిణ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కార్యాలయంలో శనివారం రాఖీ పౌర్ణమి వేడుకలు జరిగాయి. నియోజవర్గంలోని పలువురు వైసిపి మహిళా నేతలు,మహిళ కార్యకర్తలు వాసుపల్లికి రాఖీలు కట్టి, శాలువాకప్పి సత్కరించి స్వీట్స్ తినిపించారు. పేద కుటుంబాలకు అండగా, ఉండే వాసుపల్లి గణేష్‌కుమార్‌ఉన్నతస్థాయికి వెళ్ళాలని మహిళలందరూ ఆకాంక్షించారు. వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ అందరి ఇళ్లల్లో రక్ష బంధన్ పవిత్ర పండుగ అన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు,హత్యలు, దాడులు పెచ్చు మీరుతున్నాయని,వీటికి అడ్డుకట్టవేయాల న్నారు. దక్షిణ నియోజకవర్గ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా నాయకులు షబీరా బేగం, సలాది భవాని (భాను) జిల్లా నాయకులు వలిశెట్టి లక్ష్మి,రోజా, రమణి,కుమారి,ఆది లక్ష్మి, ఈశ్వరి పాల్గొన్నారు

## జాతీయ పతాకం ఆవిష్కరణ

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** స్వాతంత్ర ఉద్యమ కాలంలో క్విట్ ఇండియా నినాదం దేశాన్ని ఊపివేసిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మరాజు అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య ఉద్యమాన్ని కీలక మలుపు తిప్పిందన్నారు. పార్టీ తూర్పు ఇంచార్జ్ ప్రియాంక దండి మాట్లాడుతూ 'క్విట్ ఇండియా' నినాదం భారత స్వాతంత్ర్య సమరాన్ని కొత్తపుంతలు తొక్కించిందన్నారు. కార్యక్రమంలో పార్టీ దక్షిణ ఇంచార్జ్ కె.వి.ఎస్ సూర్యనారాయణ, భీమిలి నియోజకవర్గ ఇంచార్జ్ రామకృష్ణ, కాండవ గాయత్రి, డాక్టర్ విజయచంద్ర, మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు కోసం టిడిపి అడ్డతోవలు : బొత్స

**ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ:** పులివెందుల జెడ్‌పిటిసి ఎన్నికల్లో గెలుపు కోసం అధికార తెలుగుదేశం పార్టీ అన్ని అడ్డతోవలు తొక్కుతోందని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. శనివారం సాయంత్రం విశాఖపట్నం క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత పోలింగ్ కేంద్రాలను మార్చడం ఎప్పుడూ చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందుల్లో పోలీసులు, తెలుగుదేశం నాయకలు కలిసిపోయి పనిచేస్తున్నారని, వారి ప్రోత్సాహంతోనే ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి జరిగిందని ధ్వజమెత్తారు. ఈ దాడిలో బాధితులపైనే పోలీసులు ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసులు ఎలా పెడతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ఇటీవల రాష్ట్ర గవర్నర్‌ను వివరించాలమన్నారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని ఆయన విమర్శించారు. విశాఖపట్నంలో జరుగుతున్న భూ దోపిడీపై ముఖ్యమంత్రికి లేఖ రాశామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ మా పోరాటం సాగిస్తూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

## ఉక్కు దీక్షా శిబిరం కొనసాగింపునకు అనుమతులు

**ప్రజాశక్తి-ఉక్కునగరం :** విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పోరాటానికి కొంత మేరకు ఊరట లభించింది. పోరాట కమిటీ కూర్మన్నపాలెం కూడలిలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద దీక్షా శిబిరాన్ని నిర్వహించుకోవచ్చునని హైకోర్టు జడ్జి వెంకటేశ్వరరావు ఆర్డర్ జారీ చేశారు. దీనిపై ఉక్కు కార్మికులు, పోరాట కమిటీ నేతలు శనివారం హర్షం వెలిబుచ్చారు. దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళితే.. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నాలుగేళ్ల పైచిలుకు కాలంగా పోరాటం నడుస్తోంది. దీక్షలు కొనసాగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం వచ్చిన భారీ వర్షానికి పోరాట కమిటీ టెంట్ కూలిపోయింది. తిరిగి టెంట్ వేసుకునేందుకు పోలీసులు అంగీకరించలేదు.

దీక్షా శిబిరానికి ఎవరినీ అనుమతించలేదు. లోపలికి వెళ్లకుండా చుట్టూ ముళ్ల కంచెలు ఏర్పాటు చేశారు. తుదకు పోరాట కమిటీ న్యాయ పోరాటం గెలిచింది. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ పోరాట కమిటీ దీక్షా శిబిరాన్ని నిర్వహించకుండా ఉండేందుకు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం అనేకమార్లు వాయిదాలు తీసుకుందని తెలిపారు. అయినప్పటికీ జడ్జి వెంకటేశ్వరరావు కార్మికుల పట్ల నిబద్ధతను గమనించి పోరాట కమిటీ దీక్షా శిబిరాన్ని కొనసాగించవచ్చని ఆర్డర్లు జారీ చేశారని తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ వద్ద అనుమతులు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. అనంతరం దీక్షా శిబిరాన్ని కొనసాగించనున్నట్టు తెలిపారు.